# పగలే దొంగతనం.. నిందితుడి అరెస్ట్

**మూడు తులాల హారం, రెండు ఉంగరాలు స్వాధీనం**
**తాళం పగలగొట్టి చొరబడిన శివరాత్రి దివాకర్**
**కేసు ఛేదించిన రాజగోపాల్‌పేట పోలీసులు**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా నాగరాజుపల్లిలో పట్టపగలే జరిగిన ఒక దొంగతనం కేసును రాజగోపాల్‌పేట పోలీసులు వేగంగా ఛేదించారు. ఈ నెల 19న గ్రామానికి చెందిన ముక్కెర వెంకటేశం తన ఇంటికి తాళం వేసి పని మీద బయటకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. బీరువాలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు హారం, రెండు ఉంగరాలు మాయమవడంతో బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో శివరాత్రి దివాకర్ అనే వ్యక్తి ఈ చోరీకి పాల్పడినట్లు వెల్లడైంది. నిందితుడు ఒక రాయితో ఇంటి తాళాన్ని పగలగొట్టి లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకుని, దొంగిలించిన ఆభరణాలన్నింటినీ పోలీసులు రికవరీ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతడికి రిమాండ్ విధించిందని రాజగోపాల్‌పేట ఎస్సై టి. వివేక్ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించిన హెచ్‌సీ సంపత్, కానిస్టేబుళ్లు రమేష్, ఆనంద్, తిరుపతి రెడ్డిలను అధికారులు అభినందించారు.

# వధూవరులను ఆశీర్వదించిన షిండే

**గణేష్ గుప్త కుమారుని వివాహ వేడుకకు హాజరు**
**నూతన దంపతులకు శుభాకాంక్షలు**



**జుక్కల్, ఫిబ్రవరి 20 (జనం పవర్):**

బిచ్కుంద పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అతిమెల గణేష్ గుప్త కుమారుడి వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. హైదరాబాద్ నగరంలోని సత్య గౌరీ కన్వెన్షన్ హాల్ వేదికగా జరిగిన ఈ శుభకార్యానికి జుక్కల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు హన్మంత్ షిండే హాజరయ్యారు. నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి దాంపత్య జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ వివాహ వేడుకలో బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# అధ్యాపకుడు రఘునాథ్‌కు డాక్టరేట్

**రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుంచి పట్టా అందజేత**
**వృక్షశాస్త్రంలో శిలీంధ్రాలపై పరిశోధన**
**అభినందించిన ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు**

**బిచ్కుంద, ఫిబ్రవరి 20 (జనం పవర్):**

బిచ్కుంద ప్రభుత్వ స్వయంప్రతిపత్తి డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు ఏ. రఘునాథ్ డాక్టరేట్ సాధించారు. రాజస్థాన్‌లోని జగదీష్ ప్రసాద్ జబర్మల్ టిబ్రేవాలా విశ్వవిద్యాలయం నుంచి ఆయన ఈ పట్టాను పొందారు. డాక్టర్ దినేష్ కుమార్ సింగ్ పర్యవేక్షణలో "డాల్డైన కాన్సెంట్రికా" అనే శిలీంధ్రం సూక్ష్మజీవులపై చూపే ప్రభావం అనే అంశంపై ఆయన లోతైన పరిశోధన పూర్తి చేశారు.

**కళాశాలలో ఘనంగా అభినందనలు**

ఈ సందర్భంగా డాక్టర్ రఘునాథ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ కే. అశోక్ తో పాటు విద్యార్థులు ఘనంగా అభినందించారు. తన పరిశోధన ప్రయాణంలో సహకరించిన వారందరికీ రఘునాథ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీ. వెంకటేశం, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ టీ. హన్మండ్లు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ రమేష్ బాబు పాల్గొన్నారు. పీజీ కోఆర్డినేటర్ టీ. సంతోష్, వై. విజయ్ తో పాటు ఇతర సిబ్బంది హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు.




# ఆపరేటర్ల కొనసాగింపునకు వినతి

- **ఇరవై ఏళ్లుగా సేవలు అందిస్తున్న సిబ్బంది ఆవేదన**
- **టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడికి వినతి పత్రం అందజేత**
- **ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని శ్రీహరి హామీ**



**మంచిర్యాల, ఫిబ్రవరి 20 (జనం పవర్):**

మంచిర్యాల జిల్లా రెవెన్యూ శాఖలో పని చేస్తున్న టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్లు తమ ఉద్యోగ భద్రత కోరుతూ టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరిని ఆశ్రయించారు. శుక్రవారం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో ఆపరేటర్ల బృందం శ్రీహరిని కలిసి వినతి పత్రం సమర్పించింది. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని వారు కోరారు.

**కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాలని వేడుకోలు**

గత ఇరవై ఏళ్లుగా రెవెన్యూ శాఖలో ఆరు వందల ముప్పై రెండు మంది ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నామని వారు వివరించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులతో పాటు వివిధ ఎన్నికల నిర్వహణలో రాత్రింబవళ్లు కష్టపడి పనిచేశామని గుర్తుచేశారు. తమ జీవితమంతా ఈ శాఖకే అంకితం చేశామని, ఇప్పుడు ఇతర ఉద్యోగాలకు వెళ్లే వయస్సు కూడా దాటిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి తమను విధుల్లో కొనసాగించాలని, లేనిపక్షంలో తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వాపోయారు.

**న్యాయం చేస్తామని భరోసా**

ఆపరేటర్ల విన్నపంపై గడియారం శ్రీహరి సానుకూలంగా స్పందించారు. రెవెన్యూ ఆపరేటర్ల సమస్యను టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి తో పాటు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రితో చర్చించి, అందరికీ న్యాయం జరిగేలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. తమ గోడును ఆలకించినందుకు ఆపరేటర్ల తరఫున నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిత, రవి, షారూక్ తదితరులు పాల్గొన్నారు.





# వార్డులో నీటి సమస్యకు పరిష్కారం

- **మోటారు బాగు చేయించిన కౌన్సిలర్ హనుమవ్వ**
- **ఎమ్మెల్యే ఆదేశాలతో త్వరితగతిన పనులు**
- **కాలనీవాసుల కష్టాలు తీర్చడంపై హర్షం**

**జుక్కల్, ఫిబ్రవరి 20 (జనం పవర్):**

వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా జుక్కల్ ఒకటో వార్డు కౌన్సిలర్ గోనె హనుమవ్వ చర్యలు చేపట్టారు. వార్డులో నీటి బోరు మోటారు పాడైనట్లు స్థానికులు ఆమె దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశాల మేరకు కొత్త మోటారును ఏర్పాటు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. నీటి సౌకర్యంతో పాటు మురికి కాలువల శుభ్రం, దోమల నివారణ, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులను క్రమం తప్పకుండా చేపడతామని హామీ ఇచ్చారు. నీటి సమస్య తీరడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొగడమీద సాయిలు, గోని అశోక్, మేత్రి సాయిలు, మున్సిపల్ సిబ్బంది ర్యాకల సాయిలు పాల్గొన్నారు.



# సంగారెడ్డి అభివృద్ధికి కలెక్టర్ అండ

- **మున్సిపల్ పాలకవర్గం మర్యాదపూర్వక భేటీ**
- **అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న టీజీఐఐసీ చైర్ పర్సన్**
- **యువత ప్రాతినిధ్యంపై కలెక్టర్ ఆశాభావం**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 20 (జనం పవర్ ప్రతినిధి):**

సంగారెడ్డి మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ పాలకవర్గ సభ్యులు శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి నేతృత్వంలో వచ్చిన చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్లకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

**సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక**

సంగారెడ్డి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి ఇచ్చిన మాట మేరకు కట్టుబడి ఉంటామని పాలకవర్గ సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. పట్టణంలో మెరుగైన పారిశుద్ధ్యం, ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు ప్రతి గల్లీలో సిమెంట్ రోడ్ల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

**యువతకు కలెక్టర్ సూచనలు**


మున్సిపల్ పాలకవర్గంలో యువతీ యువకులు ఎక్కువగా ఉండటం పట్టణ అభివృద్ధికి శుభపరిణామని కలెక్టర్ ప్రావీణ్య అభిప్రాయపడ్డారు. కొత్త ఉత్సాహంతో
ప్ర జా



సమస్యలను




ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనంత కిషన్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ షఫీ హఫీజ్, సీనియర్ నాయకులు బొంగుల రవి, కూన సంతోష్ పాల్గొన్నారు. వీరితో పాటు కౌన్సిలర్లు శ్రీకాంత్, ప్రశాంత్ రెడ్డి, రవి నాయక్, ఝాన్సీ, శ్యామ్, వీణ తదితరులు హాజరయ్యారు.







# పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో హరీష్ రావు

- ఎన్సాన్ పల్లిలో ఘనంగా వార్షిక వేడుకలు
- ముదిరాజ్ సంఘానికి యాభై వేల విరాళం
- రెండే నెలల్లో వెయ్యి పడకల ఆసుపత్రి ప్రారంభం

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా ఎన్సాన్ పల్లి గ్రామంలో జరిగిన శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ వార్షిక ఉత్సవాల్లో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. ఎన్సాన్ పల్లి అభివృద్ధికి తమ హయాంలో పెద్దపీట వేసినట్లు తెలిపారు. సిద్దిపేట పట్టణం నుంచి గ్రామం వరకు నాలుగు వరుసల రహదారిని విద్యుత్ దీపాలతో సహా పూర్తి చేశామని గుర్తు చేశారు. గ్రామ సమీపంలోనే వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాల పనులు వేగంగా సాగుతున్నాయని, మరో రెండు నెలల్లో వీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. గ్రామంలో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి ముప్పై లక్షల రూపాయలు కేటాయించామని, అలాగే సిద్దిపేటలో ఆరు కోట్ల రూపాయలతో అత్యాధునిక ఫంక్షన్ హాల్ నిర్మించామని చెప్పారు. దేవాలయ అభివృద్ధి కోసం తన వంతుగా యాభై వేల రూపాయల ఆర్థిక సాయాన్ని ముదిరాజ్ సంఘం నేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సాహిత్య రంగంలో శ్రీహితకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

- తెలంగాణ సరస్వత పరిషత్తు పోటీల్లో ప్రతిభ
- కథలు, కవితల విభాగంలో నగదు బహుమతి
- పాఠశాలలో విద్యార్థినికి ఘనంగా సన్మానం



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని మొగుళ్ల శ్రీహిత సాహిత్య రంగంలో తన ప్రతిభను చాటుకుంది. హైదరాబాద్‌లో తెలంగాణ సరస్వత పరిషత్తు నిర్వహించిన రాష్ట్ర స్థాయి కథలు, కవితల పోటీల్లో ఆమె విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో శ్రీహిత ఐదు వందల రూపాయల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకుంది.

## పాఠశాలలో అభినందనల వెల్లువ

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీహితను ఘనంగా సత్కరించారు. మండల విద్యాధికారి ఎం. గౌరీ మోహన్, ఇన్ ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఏ. శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ పోతుల రమేష్ తో పాటు ఎస్ఎంసీ చైర్పర్సన్ మేకల ప్రమీల ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్న వయసులోనే సాహిత్యంపై ఆసక్తి పెంచుకుని పురస్కారం సాధించడం అభినందనీయమని వారు కొనియాడారు.

## సృజనాత్మకతకు అండగా ఉపాధ్యాయులు

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ, వారిని సాహిత్య బాటలో నడిపిస్తున్న తెలుగు భాషోపాధ్యాయులు పిన్నింటి మహేంద్రారెడ్డిని కూడా ఈ సందర్భంగా గ్రామ పెద్దలు అభినందించారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో భాష పట్ల అభిరుచిని పెంచుతాయని ఆయన తెలిపారు. శ్రీహిత సాధించిన ఈ విజయం గ్రామానికి, పాఠశాలకు గర్వకారణమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



# యువతకు వరంగా 'ఉద్యోగ యాప్'

- హరీష్ రావు చేతుల మీదుగా నూతన యాప్ ప్రారంభం
- ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో ఉచిత కోచింగ్
- సిద్దిపేట కళాశాలలో విద్యార్థులకు దిశానిర్దేశం




**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో మార్గదర్శకత్వం అందించేందుకు 'హరీష్ అన్న ఉద్యోగ యాప్'ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ప్రారంభించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక యాప్ మాత్రమే కాదని, విద్యార్థుల జీవితాలను మార్చే దిశానిర్దేశం అని పేర్కొన్నారు. గంటల తరబడి చదవడం కంటే సరైన శిక్షణ ఉండటం ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. ప్రైవేటు సంస్థలు ఉచితమని చెప్పి తర్వాత ఫీజులు వసూలు చేస్తాయని, కానీ ఈ యాప్ ఎల్లప్పుడూ ఉచితంగానే అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు.

## విద్యా కేంద్రంగా సిద్దిపేట

రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చదువుకున్న ఈ కళాశాలకు ఎంతో గొప్ప చరిత్ర ఉందని హరీష్ రావు గుర్తుచేశారు. సిద్దిపేటను ఒక విద్యా హబ్‌గా తీర్చిదిద్దామని, ఇక్కడ మెడికల్, నర్సింగ్, అగ్రికల్చర్ తో పాటు అనేక ఇతర కళాశాలలను ఏర్పాటు చేశామని వివరించారు. ఐటీ టవర్ ద్వారా స్థానిక యువతకు, ముఖ్యంగా మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కేవలం ఉద్యోగం పొందే వారిగానే కాకుండా, ఇతరులకు ఉద్యోగం ఇచ్చే స్థాయికి ఎదగాలని కోరారు. అలాగే గోదావరి జలాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి పనులతో సిద్దిపేటను ఆదర్శ పట్టణంగా మార్చామని చెప్పారు.

## ఏకాగ్రతే విజయ రహస్యం

యువత సెల్ ఫోన్లు, సోషల్ మీడియా, వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యం వైపు సాగాలని హితవు పలికారు. ఒక ఏడాది కష్టపడితే జీవితాంతం సుఖంగా ఉండవచ్చని తెలిపారు. పేదరికం చదువుకు అడ్డుకాదని, పట్టుదల ఉంటే సామాన్యుల పిల్లలు కూడా వైద్యులు, ఉన్నతాధికారులు కావచ్చని ఉదాహరణలతో వివరించారు. వేల రూపాయలు ఖర్చు పెట్టి హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఈ ఉచిత కోచింగ్ యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సదాశివపేటలో ప్రభుత్వ భూమిపై అక్రమ షెడ్ కూల్చివేత



**సంగారెడ్డి, ఫిబ్రవరి 20 (జనం పవర్ ప్రతినిధి):**

సదాశివపేట మండలం సర్వే నంబరు 165లో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూమిలో అక్రమంగా నిర్మించిన టిన్ షెడ్ ను అధికారులు కూల్చివేశారు. 1980లో గొంగ్లూరు బాగలాకు కేటాయించిన ఈ భూమిని అతని వారసుల నుంచి హైదరాబాద్ కు చెందిన మహ్మద్ సలీం అనే వ్యక్తి అక్రమంగా కొనుగోలు చేశాడు. నిబంధనల ప్రకారం అసైన్డ్ భూమిని విక్రయించడం చట్టవిరుద్ధం కావడంతో అధికారులు ఈ చర్య తీసుకున్నారు. ఫిబ్రవరి 16న అక్కడ అక్రమంగా నిర్మాణం చేపట్టినట్లు శ్రీశైలం యాదవ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన రెవెన్యూ అధికారులు, పోలీస్ బృందం సహకారంతో ఆ షెడ్ ను నేలమట్టం చేసి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.



# అక్షర సాక్షిగా.. అక్రమాల సామ్రాజ్యం!

## బ్లాక్ మెయిలింగ్ మాఫియాపై 'దుర్యోధన ఆపరేషన్'

**సైకిల్ నుంచి కోట్లాది రూపాయల బంగ్లాల వరకు..**

**జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడి ఆస్తుల వెనుక మిస్టరీ**

**జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

జర్నలిజం అంటే సామాన్యుడి గొంతుక కావాలి. కానీ కొందరికి అది కనకవర్షం కురిపించే యంత్రంగా మారిందనే ఆరోపణలు జన్నారంలో కలకలం రేపుతున్నాయి. ఒకప్పుడు సైకిల్‌పై వార్తా పత్రికలు పంపిణీ చేసిన చేతులు, నేడు కోట్లాది రూపాయల ఆస్తులను ఎలా సంపాదించాయనే అంశంపై మండల కేంద్రంలో చర్చ జోరుగా సాగుతోంది. స్థానిక విలేకరి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలివేరి నరసయ్య ఆర్థిక ప్రస్థానంపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు ఇప్పుడు 'దుర్యోధన ఆపరేషన్' రూపంలో ఒక ఉప్పెనలా మారాయి.

### లెక్కకు అందని సంపాదన

సాధారణంగా ఒక మధ్యతరగతి వ్యక్తి సంపాదనకు, నరసయ్య ఆస్తులకు మధ్య పొంతన లేదని స్థానిక మేధావులు గణితం వేసి మరీ వివరిస్తున్నారు. నెలకు 30,000 రూపాయల సంపాదన ఉండి, అందులో సగం ఖర్చులకు పోగా మిగిలిన 15,000 రూపాయలు దాచుకున్నా ఏడాదికి 1.8 లక్షలు అవుతుంది. ఇలా 30 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో ఆ మొత్తం గరిష్టంగా 54 లక్షలు మాత్రమే కావాలి. కానీ ఇక్కడ పరిస్థితి భిన్నంగా ఉంది. జన్నారంలోనే ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగు భారీ భవనాలు వెలిశాయి. వీటితో పాటు ఖాళీ స్థలాలు, సాగు భూములు, ప్లాట్లు వంటివి లెక్కకు మించి ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం జర్నలిజం వృత్తిలో ఉంటూ, ఇతర పారదర్శక వ్యాపారాలేవీ లేకుండా ఈ స్థాయి సంపద ఎలా వచ్చిందనేది ఇప్పుడు మిస్టరీగా మారింది.

### బ్లాక్ మెయిలింగ్ మాఫియా ఆరోపణలు

వార్త రాయడం కంటే, వార్తను అడ్డం పెట్టుకుని భయపెట్టడమే ప్రధాన వృత్తిగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల విషయంలో ఏదైనా చిన్న పొరపాటు దొరికితే చాలు, పత్రికలో పతాక శీర్షికన వేస్తానని బెదిరించి వారి నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం వసూళ్లకే పరిమితం కాకుండా అమాయకుల భూములను వివాదాల్లోకి నెట్టడం, ఆపై తనే మధ్యవర్తిగా మారి వాటిని తన పేరు మీదకో లేదా బినామీల పేరు మీదకో మార్చుకోవడం వంటి దందాలు సాగిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఎవరైనా ఈ అక్రమాలను ధైర్యంగా ప్రశ్నిస్తే, తనకున్న వ్యవస్థీకృత బలాన్ని ఉపయోగించి వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని తెలుస్తోంది.

### ముగుస్తున్న దుర్యోధన పర్వం?

ఈ అక్రమాలకు చరమగీతం పాడేందుకు జన్నారం మండలం ఇప్పుడు ఏకమైంది. బాధితులంతా కలిసి 'దుర్యోధన ఆపరేషన్' పేరుతో రంగంలోకి దిగారు. వీరు కేవలం ఆరోపణలు చేయడమే కాకుండా, పక్కా సాక్ష్యాధారాలతో జిల్లా కలెక్టర్ తో పాటు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. పెద్ద పత్రికా ముసుగులో కొందరు చేస్తున్న ఈ అరాచకాల వల్ల, క్షేత్రస్థాయిలో నిజాయితీగా పని చేసే విలేకరులకు విలువ తగ్గుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నిష్పక్షపాత విచారణ జరిగితేనే జన్నారం ప్రజలకు న్యాయం జరుగుతుందని, అక్షరాన్ని ఆయుధంగా మార్చుకున్న ఆక్రమార్కుడి అసలు రంగు బయటపడాలని ప్రజలు కోరుతున్నారు.

